క్లుప్తంగా

వైభవంగా శ్రీ సుదర్శన హోమం



శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో శ్రీగణ మద్దిలేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మద్దిలేటి లక్ష్మీ నృసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి గావించి మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు అమ్మవార్లకు సాముహిక ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో కల్యాణ దాతలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మండలంలో వివిధ ఆలయాల ధర్మకర్త మండలిల ఏర్పాటుకు దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓలు నరసయ్య, రామాంజనేయ శర్మ సోమవారం తెలిపారు. కోటపాడు శ్రీ వీరభద్ర, చెన్న కేశవస్వామి, శిరివెళ్ల ఓంకారేశ్వర, బోయలకుంట్ల, గుండంపాడు, శ్రీ సర్వనరసింహ స్వామి ఆలయాల్లో ధర్మకర్త మండలి ఏర్పాటుకు దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను నంద్యాల రైతు నగరంలోని దేవదాయ శాఖ జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులతో పాటు సభ్యుల ఆధార్ జిరాక్స్, సెల్ నంబర్, ఫొటో జత చేయాలన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

శిరివెళ్ల: మండలంలోని వివిధ ఆలయాల మాన్యం భూముల కౌలుకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు కోటపాడు గ్రూప్ ఈఓ రామాంజనేయ శర్మ సోమవారం తెలిపారు. 19వ తేదీన చెన్నూరు, కోటపాడు శ్రీ వీరభద్ర, చెన్న కేశవస్వామి ఆలయాల మాన్యం భూములకు, 26వ తేదీన శిరివెళ్ల ఈశ్వర స్వామి ఆలయ మాన్యం భూముల కౌలుకు బహిరంగ వేలం పాటలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు డిపాజిట్లు చెల్లించి వేలం పాటలలో పాల్గొన వచ్చన్నారు.

ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్గా వెంకటదాస్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్గా పని చేస్తున్న వెంకటదాస్ను ఆళ్లగడ్డ కమిషనర్గా ఫుల్టైం అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ)తో ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్గా పని చేస్తున్న కిశోర్ సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో ఈయనను నియమించారు. ఈమేరకు సోమవారం రాత్రి మున్సిపల్ కార్యాలయానికి ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు నంద్యాల కమిషనర్ నిరంజన్రెడ్డి తెలిపారు.

ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి చర్యలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చామ కాల్వ వద్ద వెలసిన ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలిని నియమించేందుకు చర్యలు చేపట్టినట్లు ఈఓ రామానుజన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు 9 మంది సభ్యులతో కూడిన దరఖాస్తులను మే 26లోగా జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో సాయంత్రంలోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 94403 06907 నంబరుకు సంప్రదించాలన్నారు.

సమయపాలన ఏదీ?



ప్రజావేదికలో దర్శనం ఇస్తున్న ఖాళీ కుర్చీలు

చాగలమర్రి: ప్రజలకు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాల్సిన అధికారులు సమయ పాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనుల మీద కార్యాలయాలకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో 11 గంటలైనా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. పీజీఆర్ఎస్ను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు సమయానికి హాజరు కావాలన్న ఉన్నతాధికారులు ఆదేశాలు మండలంలో అమలు కావడం లేదు. సోమవారం పీజీఆర్ఎస్కు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి రంగ నేతాజి, తహసీల్దార్ రవికుమార్ తప్ప మిగతా ప్రభుత్వ శాఖలకు చెందిన ఏ ఒక్క అధి కారి హాజరు కాలేదు. ఎండీడీఓ కార్యాలయ సిబ్బంది సైతం సమయపాలన పాటించడం లేదు

సమస్యలను పరిష్కరించండి

దొర్నిపాడు: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. సోమవారం ఆమె కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. రామచంద్రాపురంలో జరుగుతున్న భూరీసర్వే పనుల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇందుకు రైతుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలు తెప్పించుకోవాలన్నారు.

ఇళ్లపై సౌరఫలకాల ఏర్పాటుకు ప్రోత్సాహం

- అర్హుల జాబితాను సిద్ధం చేయండి
- ఈనెల ఆఖరులోపు 9,432 గృహాల నిర్మాణాలు పూర్తి కావాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇళ్లపై సౌరవిద్యుత్ ఫలకాల ఏర్పాటుకు కేంద్రం ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఈ పథకం కింద జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పదివేల ఇళ్లపై సోలార్ ఫలకాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. సోమవారం కలెక్టర్ తన చాంబర్ నుంచి పీఎం సూర్య ఘర్, హౌసింగ్, ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1,10,348 వినియోగదారులు నమోదు కాగా 87,862 దరఖాస్తులు అర్హత పొందాయని మిగిలిన దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేసేలా స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఏఈలు చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ ఫలకలు అమర్చే వెండర్ పేరు, ఫోన్ నెంబరు వివరాలను స్పెషల్ ఆఫీసర్లకు అందజేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు. బనగానపల్లె, రుద్రవరం, శిరివెళ్ల, బండి ఆత్మకూరు, పాణ్యం, నంద్యాల, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో సోలార్ ఫలకాల ఏర్పాటులో వెనుకబాడటానికి గల కారణాలపై ఆరా తీశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

జిల్లాకు కేటాయించిన 9,432 గృహాల నిర్మాణాలను మే 31వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేటాయించిన లక్ష్యంలో ఇప్పటి వరకు 2,857 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన వాటిపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ప్రతివారం గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని చెప్పారు. అలాగే ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు.

పీహెచ్సీల పనితీరును పరిశీలించండి

ఉయ్యాలవాడ : ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలపై మండలస్థాయి అధికారులు పరిశీలన చేయాలని కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీహెచ్సీల పనితీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్ల దుస్థితిపై ఆరా తీశారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయా లేవా, వైద్యాధికారులు, సిబ్బంది సమయానికి ఆసుపత్రులకు వస్తున్నారా లేదా తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశానికి హాజరైన తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలోని పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు వెల్లడించారు. అనంతరం గ్రామీణ ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల మండల అధికారులను తహసీల్దార్ సూచించారు.

ఈఈపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): కొలిమిగుండ్ల మండలంలోని సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న పొల్యూషన్తో పండ్ల తోటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నా పొల్యూషన్ ఈఈ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ఈఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రం నంద్యాలలో ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పొల్యూషన్ ఈఈకి ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించకపోతే సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సామూహిక వ్రతాలు, కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి వధూవరులను పెళ్లి పీటలపై ఆశీనులు గావించి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం భక్తజనం మధ్య స్వామి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి, సురేష్, ప్రసన్నయ్య, స్నేహలత, లీలా, లలిత, రాజేశ్వరి, శిరీష, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

నల్లవాగుపల్లెలో మారెమ్మ తల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కోలాటం ఆడుతున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని నల్లవాగుపల్లెలో మారెమ్మ జాతర సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో మొదటి రోజున మారెమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి పోతును గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం కోలాటం, రాత్రి చెక్కభజన తదితర కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణ, 14వ తేదీన న్యూ కేటగిరి వృషభ రాజములకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ఎల్లావత్తులలో..

మండల పరిధిలోని ఎల్లావత్తులలో గ్రామ పెద్దలంతా కలిసి గంగ జాతర చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యోగుల సందేహాలు నివృత్తి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): బదిలీలు, పదోన్నతుల్లో ఉద్యోగులకు నెలకొన్న సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని అంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలను విలీనం చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని వల్ల సర్ప్లస్ ఉపాధ్యాయులను విలీన పాఠశాలలకు పంపాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కేటాయించిన పీఎస్ హెచ్ఎం పోస్టులను ఏ విధంగా భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 120 మంది పిల్లలకు హెచ్ఎం, ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు జాకీర్హుసేన్, ఇద్రూస్బాషా, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు తూనికలు, కొలతలపై అవగాహన



తూనికలు కొలతలపై అవగాహన కల్పిస్తున్న జిలానీ బాషా

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలలోని నూనెపల్లె నర్స్ క్వార్టర్స్లోని సత్య సమీక్ష కేంద్రంలో సోమవారం వ్యాపారులకు తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా నూనెపల్లె శ్రీ వాసవీ రిటైల్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎం.జిలానీబాషా, ఇన్స్పెక్టర్ అనిత మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ సప్లై చేసే వారికి ఎమ్మార్పీని చెల్లించాలన్నారు. తూకంలో తేడా ఉంటే 1967 నంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు పెట్రోలు పోయించుకునే సమయంలో జీరో ఉందోలేదో చెక్ చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైల్ మర్చెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుబ్బా రజనీకాంత్, సెక్రెటరీ ఎస్వీ కిరణ్, తాళ్లూరు రమణయ్య, సుబ్బరాయుడు, నారాయణ, రామకృష్ణ, వినియోగదారులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు మానవాళికి మార్గదర్శకం



బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గౌతమ బుద్ధుడు బోధించిన అష్టాంగమార్గం విశ్వానికి వెలుగు వంటిదని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. సోమవారం నంద్యాలలోని తెలుగు తల్లి ఉద్యానవనంలో (మున్సిపల్పార్క్) బుద్ధపూర్ణిమ కార్యక్రమాన్ని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ మిత్రులు, ఉపాధ్యాయులు, కవులు బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డా.కిశోర్ కుమార్ మాట్లాడుతూ బుద్ధుని జీవితం మానవాళికి ఆదర్శమన్నారు. ఆయన బోధించిన అష్టాంగమార్గాన్ని మానవులంతా అనుసరించాలన్నారు. ముఖ్యఅతిథి సహదేవుడు మాట్లాడుతూ బుద్ధుని అడుగుజాడలు మనందరికీ వెలుగుజాడలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామసుబ్బయ్య, మనోహరరెడ్డి వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలి



కలెక్టర్కు వినతి పత్రం ఇస్తున్న లబ్బి వెంకటస్వామి

నంద్యాల(న్యూటౌన్): మిడుతూరు మండలం పైపాలెం నుంచి కలమందల పాడు వరకు ఉన్న ఏపీఐఐసీ భూములను భారత్ సింధూర్ పారిశ్రామిక వాడగా గుర్తించి ఎంఎస్ఎంఈ పథకం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి కోరారు. ఈ అంశంపై సోమవారం ఆయన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైపాలెం గ్రామ సమీపంలో 1200 ఎకరాల్లో గ్రీన్కో సోలార్ కంపెనీ నిర్మాణాలు చేపట్టడం ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలబందలపాడు గ్రామానికి సహజ సిద్ధమైన చెరువు ఉందని, ఈ చెరువుకు హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా నీటితో నింపాలన్నారు. మిడుతూరు మండలం పైపాలెం, కలబందపాడు గ్రామాల భూములను ప్రభుత్వం భారత్ సింధూర్గా నామకరణం చేసి పారిశ్రామిక వాడగా ప్రకటించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య జయంతి



అహోబిలంలో అన్నమయ్య విగ్రహంతో అర్చకులు

నంద్యాల(వ్యవసాయం): వాగ్గేయ కారుడు, పద కవితా పితామహుడు శ్రీ అన్నమయ్య జయంతి వేడుకలు నంద్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ భగవత్ సేవా సమాజ్, శ్రీ భక్తాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అన్నమయ్య స్వామి ఆలయంలో స్వామికి పంచామృత విధాన అభిషేకం, విశేష అర్చనలు, మహా మంగళ హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో వివిధ భజన బృందాలు శ్రీ అన్నమయ్య స్వామి సంకీర్తనలు ఆలపించారు.

ఆళ్లగడ్డ: తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య 891వ జయంతి వేడుకలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అహోబిలంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య విగ్రహాన్ని దేవాలయంలోని యాగశాలలో కొలువైన ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదులకు ఎదురుగా ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్కు చెందిన వరవీణ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నమాచార్య సంకీర్తనల కచేరి విశేషంగా ఆకట్టుకుంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి సోమవారం ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. కాగా కుటుంబ సభ్యులు వెంటనే గమనించి మండల కేంద్రం రుద్రవరంలోని ఓ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స అందించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మద్యం పట్టివేత

శిరివెళ్ల: అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. కోటపాడుకు చెందిన యోగానంద్ శిరివెళ్ల నుంచి 16 బాటిళ్లను స్వగ్రామంకు తీసుకెళ్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అధ్యాపకుడికి కవిరత్న పురస్కారం



కవిరత్న పురస్కారం అందుకుంటున్న రఫీ

నంద్యాల(వ్యవసాయం): వివిధ సాహితీ స్వచ్ఛంద సంస్థలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ తెలుగు భాషా వైభవానికి కృషి చేస్తున్న అధ్యాపకులు ఎండీ రఫీకి 'కవిరత్న పురస్కారం దక్కింది. 'శ్రీశ్రీ కళావేదిక' నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో భాగంగా జాతీయస్థాయిలో రచన, తెలుగు భాషాభివృద్ధిలో విశిష్ట సేవలందిస్తున్న సాహితీ వేత్తలకు సోమవారం ఏలూరు పట్టణంలోని మహాలక్ష్మీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పురస్కారాలతో సత్కరించారు. నంద్యాల పట్టణంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న రఫీ దశాబ్ద కాలంగా వివిధ పత్రికలకు వ్యాసాలు, కవితలు రాస్తూ రచయితగా గుర్తింపు పొందారు. రఫీ సాహితీ సేవలను గుర్తించిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రసాద్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం కన్వీనర్ కొల్లు రమావతి తదితరులు 'కవిరత్న' జాతీయ ప్రతిభా పురస్కారం ప్రదానం చేసి జ్ఞాపిక శాలువాతో సత్కరించారు. పురస్కారం అందుకున్న రఫీని వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ రవీంద్రనాథ్, సమ్మద్, డాక్టర్ హయగ్రీవాచార్యులు, గెలివి సహదేవుడు, రమణమూర్తి, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి శ్రీనివాసమూర్తి, కిశోర్ కుమార్, ముర్తుజా తదితరులు సోమవారం అభినందించారు.

హోరాహోరీగా ఒంటెద్దు బండి పోటీలు

- విజేతగా నిలిచిన పెద్దకందుకూరు వృషభం



రాతిదూలం లాగుతున్న ఎద్దు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఒంటెద్దుబండి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 12 వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. నిర్ణీత 10 నిమిషాల సమయంలో ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరుకు చెందిన పెద్ద గురువయ్య వృషభం ప్రథమ స్థానంలో నిలిచి రూ. 15 వేలు కైవసం చేసుకుంది. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన పోషన నరసింహారెడ్డి ఎద్దు రెండవ స్థానంలో రూ. 10 వేలు దక్కించుకుంది. ఇదే జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తుంగా నారాయణస్వామి వృషభం తర్వాతి రెండుస్థానాల్లో నిలిచి రూ.8 వేలు, రూ.6వేలు బహుమతులు గెలుపొందాయి. నాసారి సిద్దయ్య, సొదరదిన్నె సర్పంచ్ ఆసం మధుసూదన్రెడ్డి, పాండురంగస్వామి ఉత్సవ కమిటీ ఆర్థిక సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు కరిమద్దెల మురళీకృష్ణ, పెనుగొండ రాజశేఖర్, గడ్డం నాగేశ్వరరెడ్డి, సహదేవరెడ్డి, లక్ష్మీనాగేంద్రబాబు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

శిరివెళ్ల: కొత్త రేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ పుష్పకుమారి సోమవారం తెలిపారు. రేషన్ కార్డులలో చేర్పులు, మార్పులు, చిరునామా మార్పు చేయబడునన్నారు. మరణించిన వారి పేరు తొలగింపు,కొత్తవారి చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సాధికారిక సర్వేలో పేర్లు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : మండలంలో అర్హులు రేషన్కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్బాబు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల తొలగింపు, నమోదు, చిరునామాలో మార్పులు, రేషన్కార్డుల సరెండర్, పేర్లలో మార్పుల కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోస్పాడు: గ్రామ సచివాలయాల్లో రేషన్ కార్డులకు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ షేక్మొహిద్దీన్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు రేషన్ కార్డులకు సంబంధించిన వెబ్సైట్ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రెవెన్యూ శాఖలో చేరి 38 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తహసీల్దార్ షేక్మొహిద్దీన్ను రెవెన్యూ సిబ్బంది అభినందించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ హుసేని, ఆర్ఐ మోహన్రెడ్డి, సర్వేయర్ ఉమామహేశ్వరరావు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సమితి నాయకులు

నంద్యాల(అర్బన్): సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31న సంగమేశ్వరంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దామని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు భాస్కరరెడ్డి, పట్నం రాముడు రైతులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని చాంద్బాడా, బాలాజీ కాంప్లెక్స్లతో పాటు చాబోలు, మునగాల, అయ్యలూరు, పెద్దకొట్టాల, పోలూరు, పాండురంగాపురం గ్రామాల్లో సిద్ధేశ్వరం బహిరంగ సభ విజయవంతంపై సమితి నాయకులు విస్తృతంగా పర్యటించి ప్రచార పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం పాండురంగాపురంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాయలసీమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పట్టిసీమ పూర్తయితే శ్రీశైలం నీళ్లన్ని సీమకే అన్న పాలకుల నేడు మాటమార్చుతున్నారన్నారు. కార్యక్రమంలో జానో జాగో కన్వీనర్ మహబూబ్బాషా, మునగాల చంద్రశేఖర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా పాఠశాలల మనుగడ



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రస్తుతం పాఠశాల విద్య గందరగోళంగా మారిందని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో పాఠశాల విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. దీని వల్ల ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 117 జీవో రద్దు పేరుతో పాఠశాల వ్యవస్థలో గందరగోళ పరిస్థితులను సర్కారు సృష్టిస్తుందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, నరసింహరావు, సుబ్బయ్య, దొర్నిపాడు హెచ్ఎం శ్రీనివాసరావు, నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో లోపాలు సవరించాలి



దీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జీఓ 117 రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా విడుదల చేసిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ నిబంధనలను సవరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 రకాల పాఠశాలల వ్యవస్థ ఏ దేశంలో కూడా లేదన్నారు. ఈ విధానాలు పాఠశాల విద్యను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తూ పాఠశాలలను కుదించి వేస్తున్నాయన్నారు. బదిలీలకు సంబంధించిన జీవో ఇంత వరకు విడుదల కాలేదన్నారు. విద్యాశాఖ తీసుకుంటున్న గందరగోళ విధానాలకు స్వస్తి పలకాలని లేని పక్షంలో పోరాటాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, శాంతిప్రియ, సుజాత, బాబాఫక్రుద్దీన్, కిశోర్, ముర్తుజావలి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.